నరకానికి నకళ్లు..!


వేంకటేశ్వర కాలనీ నుంచి ఉప్పివలస రహదారి


- అసంపూర్తిగా వదిలేసిన రహదారుల పనులు
- నెలలతరబడి ప్రజలకు నరకం
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో కష్టాలు

రణస్థలం:

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలన కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడినట్లుందని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె పండుగ పేరుతో సీసీ రహదారులు, బీటీ(తారు) రోడ్లు నూతనంగా వేస్తామని చెప్పి ఎక్కడికక్కడే తవ్వి వదిలేశారు. హడావుడిగా కూటమి నాయకుల పేర్లను వెండర్లుగా నమోదు చేయించుకున్నారు. సొమ్ములు కలిగిన నాయకులు కొన్నిచోట్ల సీసీ రహదారులు వేసినా, మరికొన్ని ప్రాంతాల్లో బిల్లులు వస్తేనే వేస్తామని చేతులెత్తేశారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులతో సీసీరోడ్లు వేసినా కనీసం వాటరింగ్ చేయకపోవడంతో పాటు రహదారులకు ఇరువైపులా బెర్ములు కూడా నిర్మించలేదు. అలాగే కొంతమేర పాడైన తారురోడ్లు స్థానంలో కొత్తరోడ్లు వేస్తామని ప్రొక్లెయినర్‌తో తవ్వేసి నెలల తరబడి వదిలేశారు. దీంతో ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. కొత్త రోడ్లు ఎప్పుడు వేస్తారో కానీ ప్రస్తుత రహదారులపై వాహనాలు నడపాలంటే నరకం కనిపిస్తోందని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

మోక్షమెన్నడో..?

రణస్థలం మండలంలోని రావాడ నుంచి కేజీబీవీ వరకు, జేఆర్‌పురం వేంకటేశ్వర కాలనీ నుంచి ఉప్పివలస వరకు, కమ్మసిగడాం నుంచి దేవరాపల్లి వరకు, అలాగే లావేరు మండలంలోని బెజ్జిపురం రహదారి మురపాక నుంచి నక్కపేట వరకు, తాళ్లవలస జాతీయ రహదారి నుంచి బొడ్డపాడు వరకు, రణస్థలం ఎమ్మార్వో ఆఫీస్ నుంచి వేణుగోపాలపురం, అలాగే రణస్థలం చెరువు కొమ్ము నుంచి నాగప్పా లెం వరకు రోడ్లు తవ్వి సగంలో వదిలేశారు.


రణస్థలం ఎమ్మార్వో ఆఫీస్ నుంచి వేణుగోపాలపురం రహదారి

ప్రజలకు ఇక్కట్లు

కొన్ని రహదారులు చదునుచేసి చిన్న, చిన్న చిప్స్ వేసి నెలలు గడుస్తున్నా అలాగే వదిలేయడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. దమ్ము, ధూళి లేచిపోవడంతో ప్రజలు శ్వాసకోస ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు సైతం అవస్థ లు పడుతున్నారు. జేఆర్‌పురం పంచాయతీ లోని వేంకటేశ్వర కాలనీ నుంచి రావాడ పంచాయతీలోని ఉప్పివలస వరకు వెళ్లే రహదారి నాలుగు కిలోమీటర్లు కనీసం చిప్స్ కూడా వేయలేదు. దీంతో రాళ్లపైన వాహనాలు నడపాల్సి రావడం, ద్విచక్ర వాహనదారులు నిత్యం అదుపుతప్పి పడిపోవడం జరుగుతోంది. దీంతో ఈ అధ్వాన రహదారుల పరిస్థితి ఎప్పుడు మారుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

బిల్లులు రాకపోవడంతోనే...

నియోజకవర్గంలో తారురోడ్లు వేసేందుకు పనులు ప్రారంభించాం. అయితే ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో నిలిచిపోయాయి. ఒకటి, రెండు నెలల్లో బిల్లులు రాగానే పనులు చేస్తాం.

– సనపల శ్రీరాములు, పంచాయతీరాజ్ డీఈఈ

తక్షణమే పూర్తి చేయాలి



కూటమి ప్రభుత్వ నాయకులు రహదారులు వేస్తామని చెప్పి ఎక్కడికక్కడే తవ్వి వదిలేశారు. జే.ఆర్.పురం వేంకటేశ్వర కాలనీ నుంచి ఉప్పివలస రహదారికి కనీసం చిప్స్ కూడా వేయకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి త్వరగా అసంపూర్తిగా వదిలేసిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.

– మజ్జి రమేష్, రణస్థలం గ్రామస్తుడు

క్లుప్తంగా

దరఖాస్తులకు నేటితో గడువు పూర్తి

జి.సిగడాం: స్థానిక కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణకు శుక్రవారంతో గడువు పూర్తవుతుందని ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్లను కూడా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

16న సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు మీసాల సత్యవతి అధ్యక్షత వహిస్తారన్నారు. సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరవ్వాలని కోరారు.

నివాళి


సి.వై.చింతామణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రముఖ సంపాదకుడు, రచయిత సి.వై.చింతామణికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని ఎంజేఎంసీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సామాజిక, రాజకీయ, జర్నలిజం రంగాల్లో ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జీఎల్‌వీ ప్రసాద్, డాక్టర్ వై.డి.రామదాస్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: అన్ని ప్రాంతాలకు అందుబాటులో ఉన్న ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పీవీఎల్ నారాయణ రావు సూచించారు. కళాశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ ఏడాది క్లాస్ వర్క్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హోమియోతో ఆనందకర జీవితం


వేడుకల్లో పాల్గొన్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం: హోమియో వైద్యంతో ఆనందకర జీవితం పొందవచ్చని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పీజీ గుప్త, ఎస్.జోగినాయుడు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రపంచ హోమియో దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే హోమియో వైద్యం ఒక్కటే శరణ్యమన్నారు.కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జి.సత్యనారాయణ, జగ్గారావు, జి.లక్ష్మి, ఎ.శాంతి, వి.జ్యోతి, ఎం.మల్లిబాబు, ఎన్.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దత్తక్షేత్ర నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి


అనుగ్రహ భాషణం చేస్తున్న దత్త విజయానంద తీర్థస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని దత్త క్షేత్రం రోడ్డుకు దిగువన ఉండడంతో స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, అందువలన త్వరితగతిన రోడ్డుకు సమాంతరంగా ఆలయ నిర్మాణాలు చేపట్టాలని ఉత్తరాధి పీఠాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామిజీ సూచించారు. ఆలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దాతలు, భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఆలయ నిర్మాణాలకు సహకరిస్తున్న దాతలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

చెరువు గట్టు ఆక్రమణ


చెరువు గట్టుపై ఫిల్లర్లు వేసిన దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట గ్రామ పంచాయతీ పరిధి కొయ్యరాళ్ల సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న లత్సయ్య చెరువు గట్టు ఆక్రమణలకు గురవుతోంది. చెరువు గట్టుపై ప్రహరీ కోసం పక్కనే భూమి ఉన్న వ్యక్తి ఫిల్లర్లు వేస్తుండగా స్థానికులు గురువారం అడ్డుకున్నారు. సర్వే నంబర్ 557/3లో 1.63 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువు ఉంది. ఇది స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అందువలన అధికారులు సమగ్ర సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు. కాగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, తమ దృష్టికి వస్తే సర్వే చేస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ బి.గోపాలరావు తెలియజేశారు.

ఆస్తిపన్ను ముందస్తు చెల్లింపుపై రాయితీ

శ్రీకాకుళం: అన్ని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో ముందస్తుగా అస్తి పన్ను చెల్లిస్తే రాయితీ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నును ఏప్రిల్ 30వ తేదీలోగా చెల్లిస్తే వారు చెల్లించే పన్నులో 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, అధికారులు పన్నుల వసూలు శతశాతం పూర్తి చేసేందుకు కొత్త ప్రకటనలు చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ రూ.28 కోట్ల మేరకు ఆస్తి పన్ను వసూలు చేసింది. మార్చి నెలలో వడ్డీపై 50 శాతం రాయితీ ఇవ్వడంతో ఒక్క నెలలోనే రూ.8 కోట్ల పన్నులు వసూలు చేయగలిగారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జి.సిగడాం: పౌష్టికాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. మండలంలోని దేవరవలస, మంగమ్మపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహర పక్షోత్సవాల అవగాహన సదస్సులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టాలని, దీనివలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పి.సుశీల, విజయలక్ష్మి, సత్యవతి, ఏఎన్ఎం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: పౌష్టికాహారంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ కె.అరుణకుమారి తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పొన్నాడ సెక్టార్ పరిధిలోని తెప్పరేవు, పాత పొన్నాడ గ్రామాల్లో గురువారం అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1000 రోజులు పిల్లల పెంపకం, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.


ఎచ్చెర్ల క్యాంపస్: పాత పొన్నాడలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో ప్రభుత్వం సరఫరా చేసిన నోట్‌బుక్స్‌ను ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులు నోట్‌బుక్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ ఏడాది తరగతులు ఈనెల 23వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయన్నారు. మధ్యాహ్న భోజనం సైతం అమలు జరుగుతుందని చెప్పారు. అధ్యాపకులు సనపల షణ్ముఖరావు, నడిమింటి ధర్మారావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు



రణస్థలం: స్థానిక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఆర్‌పురం, రణస్థలం, రావాడ, కొండములగాం, కమ్మసిగడాం, వేల్పురాయి, దేవరాపల్లి, అర్జునవలస, ఎం.నగరప్పాలెం, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నానపాలెం, సంచాం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కుప్పిలి, ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ల నిర్వహణ, లైన్ల మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లు తొలగింపు వంటి పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ కోత అమలు చేయనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోత ఉంటుందని చెప్పారు. ఎచ్చెర్ల, చిలకపాలేం, ఎస్ఎస్ఆర్‌పురం, ఫరీదుపేట, ఎస్ఎంపురం, జరజాం, డి.మత్స్యలేశం, భగీరథపురం గ్రామాల వినియోగదారులు గమనించాలని కోరారు.

చిన్నారుల సంరక్షణే ఊయల లక్ష్యం


ఊయల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: పసిపిల్లల సంరక్షణే ఊయల కార్యక్రమం లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు రణస్థలం ఆధ్వర్యంలో ఊయల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలని, అనారోగ్యవంతులని, అంగవైకల్యం కలవారిని, అలాగే అవాంఛిత గర్భం వలన పుట్టిన పసిపిల్లలను వద్దనుకుంటే, వారిని ఊయలలో వేయాలని కోరారు. ఇటువంటి పిల్లలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంరక్షించి, అవసరమైన తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తతగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ రణస్థలం పీవో సీహెచ్ ఝాన్సీ, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పథకాలు అందజేయండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో అందజేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. స్థానిక బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రుణాలు సక్రమంగా మంజూరు చేయాలని, వసతి గృహాల నిర్వహణ పూర్తిస్థాయిలో జరగాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్ రెడ్డి, బీసీ సంక్షేమాధికారి ఇ.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనతో నష్టం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

శ్రీకాకుళం కల్చరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్)తో దక్షిణాది రాష్ట్రాలకు ఎంతో నష్టం వాటిల్లుతుందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక కేంద్ర గ్రంథాలయంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'నియోజకవర్గాల పునర్విభజన – పూర్వాపరాలు – శాస్త్రీయ పద్ధతి' అనే అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, అంబేడ్కర్ యూనివర్సిటీ జర్నలిజం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రెడ్డి తిరుపతిరావు, ప్రముఖ న్యాయవాది పీవీఎస్ సీతారామయ్యలు ప్రసంగించారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే, కుటుంబ నియంత్రణను సక్రమంగా అమలు చేసి, జాతీయ లక్ష్యాలు సాధించిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పార్లమెంటులో తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివలన జనాభా నియంత్రణ సక్రమంగా అమలు చేయని ఉత్తరాది రాష్ట్రాలకు మేలు జరుగుతుందన్నారు. అందువలన అన్ని రాష్ట్రాలు, పార్టీలు, అభ్యుదయ సంస్థలు, సంఘాలతో సంప్రదింపులు జరిపి నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కోశాధికారి పి.సుధాకర్‌రావు అధ్యక్షత వహించగా కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, మధు, కేవీఎస్ రామకృష్ణారావు, కొత్తకోట అప్పారావు, కేఎస్ఎన్ మూర్తి, గణపతి, సాహితీ స్రవంతి కన్వీనర్ శ్రీనివాస్, లక్ష్మీ, నాగమణి, చందు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓపెన్ ఫోరం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం పరిధిలో శుక్రవారం ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మాణాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల సలహాలు, సూచనలు తీసుకునేందుకు ఈ ఫోరం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమానికి నగరంలో భవన నిర్మాణ యజమానులు, లైసెన్స్ టెక్నికల్‌పర్సన్స్ హాజరై వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా రథోత్సవం

అరసవల్లి: స్థానిక సూర్యనారాయణ స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రథోత్సవం ఘనంగా జరిగింది.

స్కూల్ బస్సు అడ్డగించడంపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: పొందూరు రోడ్డులోని చిలకపాలేం సమీపంలో రణస్థలంకు చెందిన ఒక పాఠశాల బస్సుకు రెండు ట్రాక్టర్లు అడ్డంగా ఉంచి, అడిగితే బస్సు డ్రైవర్‌పై దాడికి ప్రయత్నించారని డ్రైవర్ రవికుమార్ బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. బస్సుకు అడ్డంగా ట్రాక్టర్లు ఉంచడంతో పాటు డ్రైవర్‌పై దుర్భాషలాడడంపై లక్ష్మణరావు, రాము అనే వ్యక్తులపై ఎచ్చెర్ల పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

బీసీ భవనం ప్రారంభం నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలో నిర్మాణం పూర్తయిన బీసీ భవన్‌ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ భవనం పనులు వైఎస్సార్‌సీపీ హయాంలో సుమారు 90 శాతం పూర్తయ్యాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భవనానికి తుది మెరుగులు దిద్దడంతో ప్రారంభానికి సిద్ధమైంది.

అవగాహన



చిలకపాలేంలోని శ్రీశివానీ కాలేజీలో శక్తియాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. శక్తి యాప్ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఎం.రవికుమార్ విద్యార్థినులకు యాప్ పనిచేసే విధానం తెలియజేశారు. విద్యార్థినులతో యాప్ డౌన్‌లోడ్ చేయించారు. ప్రమాద సమయంలో ఎస్ఓఎస్ ద్వారా కాల్ చేయాలని సూచించారు. నెట్ లేకపోయినా పోలీసులకు సమాచారం చేరుతుందని తెలియజేశారు. కళాశాలల్లో మాదకద్రవ్యాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ఆసక్తి



వర్షాధార ప్రాంతాల రైతులు అంతర పంటలపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఎచ్చెర్ల మండలంలోని కుప్పిలి, అజ్జరాం, ఎచ్చెర్ల వంటి గ్రామాల్లో ఇటువంటి పంటలు అధికంగా పండిస్తున్నారు. కొబ్బరి, అరటి, మిరప, బెండ, మునగ వంటి పంటలు ఒకే చోట వేస్తున్నారు. దీనివలన తక్కువ పెట్టుబడి, సాగునీటితో పలు రకాల పంటలు చేతికి అందివస్తున్నాయని చెబుతున్నారు. అంతేకాకుండా ఒక పంట నష్టపోయినా, మరోపంట దిగుబడులు ఇస్తోందని పేర్కొంటున్నారు.

– ఎచ్చెర్ల

భక్తిశ్రద్ధలతో పూజలు


శ్రీకాకుళం కల్చరల్: పాండ్రంగి వీధిలో సీతారాముల పట్టాభిషేకం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని తమ్మినాయుడుపేట గ్రామంలో ఉన్న లలితా త్రిపుర సుందరి ఆలయంలో ఎచ్చెర్ల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

గార: మండలంలోని బూరవిల్లి షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, విశేష పుష్పాలంకరణ సేవ చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం వేళలో బాబా పల్లకీ సేవ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీతారాములకు పట్టాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ఆలయాల్లో గురువారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. పాండ్రంగి వీధిలోని రామ మందిరంలో, నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి ఆలయం వద్దనున్న రామ మందిరంలో, నగరంలోని కోదండ రామాలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.


గార: పూజలు చేపడుతున్న భక్తులు

మాక్ డ్రిల్ నేడు


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

రణస్థలం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు రణస్థలం మండలంలోని జీరుపాలెం గ్రామంలో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విపత్తుల నిర్వహణ మాక్ డ్రిల్‌పై సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాన్, అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు తదితర అంశాలపై తీసుకునే జాగ్రత్తలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రీల్ నమూనా కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లాస్థాయిలో గల అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలియజేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.